



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

రుణమాఫీపై.. ఆందోళనలు

- జిల్లాలో మూడో విడతలోనూ రుణమాఫీ కాలేదంటూ రైతన్నల ఆగ్రహం
- తలమడుగు, జైనథ్ మండలాల్లో రోడ్డెక్కిన రైతులు
- బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఖాతాల్లోనే గందరగోళం
- ప్రభుత్వంపై విమర్శలతో దాడికి దిగుతున్న ప్రతిపక్షాలు
- రైతుల్లో అవగాహన కల్పించలేకపోతున్న వ్యవసాయ శాఖ



తలమడుగులో రైతులతో కలిసి ధర్నాకు దిగిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆదిలాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి)/తలమడుగు/జైనథ్/బోథ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రూ.2 లక్షల రుణమాఫీపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ కావడం లేదంటూ రైతులు ఆందోళనలు, నిరసనలకు దిగుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం విడతల వారీగా పంట రుణాలను మాఫీ చేస్తూ వస్తోంది. జూలై 18న మొదటి విడతను ప్రారంభించి ఆగస్టు 15తో మూడు విడతలను పూర్తి చేసింది. అయితే మూడు విడతల్లోనూ పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత నెలరోజులుగా వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా.. రుణ విముక్తి కావడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్నిరకాల అర్హతలు ఉన్నా.. రుణమాఫీకి నోచుకోవడం లేదని అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో మొత్తం లక్షా 64వేల 606 మంది రైతులు భూపట్టాలను కలిగి ఉన్నారు. ఇందులో మొదటి విడత కింద 18,821 మంది రైతులకు గాను రూ.120.79 కోట్లు, రెండో విడతలో 17,647 మంది రైతులకు గాను రూ.201.88 కోట్లు, మూడో విడతలో 19,493 మంది రైతులకు గాను రూ.286.26కోట్ల పంట రుణాలను మాఫీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. మొత్తం మూడు విడతల్లో 55,961 మంది రైతులకు గాను రూ.608.88 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. కానీ పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదంటూ రైతులు నిరసనలకు దిగుతున్నారు. శనివారం తలమడుగు, జైనథ్, బోథ్ మండలాల్లో రైతులు ఆందోళనలు, నిరసనలు చేపట్టారు. ఇచ్చిన మాట ప్రకారం పంట రుణాలను మాఫీ చేయాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే త్వరలోనే స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించి అందరికీ రుణమాఫీ జరిగేలా చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

రోడ్డెక్కిన రైతులు

అర్హులైన రైతులందరికీ వెంటనే రుణమాఫీ చేయాలంటూ రైతులు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. తలమడుగు మండలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మతో రైతులు డప్పులు, మేళాలతో ఊరేగింపును నిర్వహించి ఆందోళనకు దిగారు. వీరికి మద్దతుగా ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ రైతులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. అలాగే జైనథ్ మండలం గిమ్మా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రను ముట్టడించిన రైతులు గిమ్మా ఎక్స్‌రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. అలాగే బోథ్ మండలంలో రైతులు భారీ ర్యాలీని నిర్వహించారు. ఆగస్టు 15న ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తూ మూడో విడతను ప్రకటించింది. దీంతో తమకు రుణమాఫీ వర్తిస్తుందో? లేదో?నని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మొదటి, రెండవ విడతల్లో చాలా మంది రైతులకు రుణ విముక్తి కాకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూ.2 లక్షలకు పైగా రుణం తీసుకున్న రైతుల పరిస్థితి ఏమిటనే దానిపై ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వకపోవడంతో గందరగోళ పరిస్థితులకు దారి తీస్తోంది.

స్పెషల్ డ్రైవ్ మార్గదర్శకాలు ఇలా..

1. మండలంలో ఉన్న అన్ని బ్యాంకులు, పీఏసీఎస్ శాఖల్లో తీసుకున్న రైతు రుణమాఫీ సమస్యల పరిష్కారానికి రైతులు మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలి.
2. రైతులు ఇచ్చిన ఫిర్యాదులను ప్రత్యేక పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.
3. ఆధార్ తప్పుగా ఉన్న సందర్భంలో మండల వ్యవసాయాధికారి తప్పనిసరిగా రైతు నుంచి ఆధార్ కాపీని పొందాలి. ఆధార్‌ని సరిచేసి అప్‌లోడ్ చేయాలి. అలాగే ఓటర్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, రైతు రేషన్‌కార్డు వంటి ప్రత్యామ్నాయ గుర్తింపు పత్రాలను సేకరించి అప్‌లోడ్ చేయాలి.
4. వ్యవసాయ శాఖాధికారులు రైతుల ఇంటికి వెళ్లి రైతు వెల్లడించిన ఆధార్ కాపీ, కుటుంబ సభ్యుల సంఖ్యను తప్పనిసరిగా గుర్తించాలి. అలాగే ప్రత్యేక పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.
5. రైతుల పట్టాపాస్‌బుక్ పత్రాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.
6. ఆధార్‌కార్డులో ఉన్న పేరు లోన్‌ఖాతాలో పేరు తేడాలు ఉంటే ప్రత్యామ్నాయంగా ఇతర గుర్తింపు కార్డులను పరిగణలోకి తీసుకోవాలి. ఆ తర్వాత సరైన ఆధార్ నెంబర్‌ను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.
7. అసలు, వడ్డీ వివరాలు సక్రమంగా లేని యెడల రైతు నుంచి దరఖాస్తులు తీసుకొని ఆ వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.
8. పోర్టల్‌లో నమోదు చేసిన వివరాల ఆధారంగా రుణమాఫీ సమస్యలను పరిష్కరించాలి.

బ్యాంకు అధికారుల తప్పిదం

అధికారుల తప్పిదాలతో రైతులు అవస్థల పాలవుతున్నారు. ముఖ్యంగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఖాతాల్లోనే గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. రైతుల పంట రుణాలకు సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడమే ఈ పరిస్థితికి అసలు కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఎక్కువగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో రుణాలు తీసుకున్న రైతులకే ఎక్కువగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా తలమడుగు, గిమ్మా, ఆదిలాబాద్, జైనథ్ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలోనే ఇలాంటి పరిస్థితి ఉందని అధికారులు చెబుతున్నారు. మొదటి విడతలోనే అర్హత ఉన్న చాలా మందికి రుణమాఫీ కాలేదు. దీంతో స్పందించిన కలెక్టర్ రాజర్షిషా వ్యవసాయ శాఖాధికారులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సుమారుగా 400లకు పైగా రైతుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి పంపించారు. అయినా ఇప్పటి వరకు రుణమాఫీ కాకపోవడంతో రైతులు ఆందోళనబాట పడుతున్నారు. మొదటి, రెండవ విడతల్లో రుణమాఫీ దక్కని రైతులే ప్రస్తుతం ఆందోళనబాట పడుతున్నారు.

విమర్శలకు పదును

ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ అసంపూర్తిగానే ఉందంటూ ప్రతిపక్షాలు విమర్శలకు పదును పెడుతూ ఎదురుదాడికి దిగుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన రైతులందరికీ ఏకకాలంలో రుణమాఫీ చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీలు రుణమాఫీ కోసం రైతులకు మద్దతుగా నిలుస్తున్నాయి. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌లు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ పూర్తిగా మోసపూరితంగా ఉందంటూ ఆరోపిస్తున్నారు. ఎక్కడా పూర్తిస్థాయిలో రుణమాఫీ జరుగలేదంటూ ఆరోపిస్తున్నారు.

వ్యవసాయ శాఖ విఫలం

గత నెల రోజులుగా రైతులు రుణమాఫీ కాలేదంటూ బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా.. వ్యవసాయ శాఖాధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇదిగో అదిగో అంటూ కాలం వెళ్లదీస్తున్నారే తప్ప అసలు రైతులకు ఎందుకు రుణమాఫీ కాలేదని? స్పష్టంగా చెప్పలేక పోతున్నారు. నిరక్షరాస్యులైన అమాయక రైతులకు రుణమాఫీ గైడ్‌లైన్స్ సరిగా అర్థంకాక పోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. క్షేత్రస్థాయిలో రుణమాఫీ విధివిధానాలపై అవగాహన కల్పించిన దాఖలాలు కనిపించడం లేదు. ఇప్పటికే గ్రామస్థాయిలో అవగాహన కల్పించి ఉంటే ఇలాంటి పరిస్థితులు ఉండేవి కావన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్దేశం మంచిదే అయినప్పటికీ.. అధికారుల నిండు నిర్లక్ష్యంతో లక్ష్యం నీరుగారి పోతోందనే అభిప్రాయాలు లేకపోలేదు.



ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు అండే నారాయణ. తలమడుగు మండల కేంద్రానికి చెందిన ఈ రైతు ఐదు ఎకరాల భూమిని కలిగి ఉన్నాడు. గత నాలుగైదేళ్ల క్రితం మండల కేంద్రలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో పంట రుణంగా రూ.లక్షా 30వేలు తీసుకున్నాడు. ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీలో ఇప్పటి వరకు ఈ రైతుకు రుణవిముక్తి కలుగలేదు. మూడు విడతల్లోనూ రుణమాఫీ కాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నాడు. తన భార్య పేరిట కూడా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలోనే రూ.లక్షా 60వేల పంట రుణం ఉంది. కానీ ఇప్పటి వరకు ఏఒక్కరికి రుణమాఫీ కాకపోవడంతో అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. ఇలాంటి పరిస్థితే జిల్లాలో చాలామంది ఎదుర్కొంటున్నారు. అయినా అధికారులు పరిష్కార మార్గం చూపడం లేదని రైతులు పేర్కొంటున్నారు.

ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నాయి

- డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

ఆదిలాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఇచ్చిన మాట ప్రకారం రూ.2లక్షల రుణమాఫీ చేసి ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మండిపడ్డారు. శనివారం ప్రజాభవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు అధైర్యపడొద్దని ప్రతి ఒక్కరికి రుణమాఫీ జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. త్వరలోనే స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించి రుణమాఫీ జరుగని రైతులను గుర్తించడం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించని విధివిధానాలను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు రైతులను రెచ్చగొట్టే విధంగా ప్రయత్నాలు చేయడం మానుకోవాలన్నారు. లేదంటే గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పుల చిట్టాను విప్పుతామని హెచ్చరించారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తే ఊరుకునేది లేదన్నారు. అధికారంలోకి వచ్చిన 8నెలల్లోనే ఎన్నో హామీలను అమలు చేసి నిరూపించుకోవడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ నేతలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని రైతుల పేరుతో ధర్నాలు, రాస్తారోకోలతో పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షాన పని చేస్తోందన్నారు. ఇందులో గిమ్మ సంతోష్, చరణ్‌గౌడ్, చందనర్సింగ్, కోరెడ్డి కిషన్, ఎంఏ ఖయ్యుం డేరా కృష్ణారెడ్డి, ఇజ్జగిరి సంజయ్, పోతారెడ్డి, చందు, తదితరులున్నారు.

రుణమాఫీపై ఆందోళన వద్దు

- కాంగ్రెస్ నాయకులు ఆడే గజేందర్

తలమడుగు, ఆగస్టు 17: రుణమాఫీపై రైతులు ఆందోళన చెందవద్దని అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయిస్తామని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శనివారం మండలంలోని దేవాపూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 56,409 ఖాతాదారులకు గాను రూ.615.59 కోట్లతో రుణమాఫీ చేయడం జరిగిందని, కొంత మంది బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతో కానీ రైతులందరికీ వ్యవసాయ శాఖ అధికారులతో ఇంటింటా సర్వే నిర్వహించి ఈనెల 30లోగా రైతులందరికీ రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తలమడుగు మండల రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని ఆయన సూచించారు. ఇచ్చిన మాటకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతిపక్షాల మాటలను ఎవరూ మోసపోవద్దని ఆయన పేర్కొన్నారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మాజీ జడ్పీటీసీ గణేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్యాణలక్ష్మీ, రాజేశ్వర్, కౌడాల సంతోష్, వెంకట్ యాదవ్, రామ్‌రెడ్డి, పోశెట్టి, ప్రవీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం



కావడి యాత్రలో పాల్గొన్న భక్తులు

వైభవంగా కావడి యాత్ర

ఇంద్రవెల్లి, ఆగస్టు 17: ప్రతియేటా శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని శ్రావణ శనివారం సందర్భంగా శనివారం మండలంలోని ముత్నూర్ గ్రామంలోని భక్తులు ముత్నూర్ నుంచి మెండపల్లి గ్రామంలోని శివాలయం వరకు కావడి యాత్రను శోభాయమానంగా నిర్వహించారు. గ్రామంలోని శివాలయం వద్ద భక్తులు శివలింగానికి పూజలు నిర్వహించి కుండల్లో జలాన్ని కావళ్లతో మోసుకుంటూ శంభోశంకర అంటూ భజనలతో యాత్ర కొనసాగింది. రెడున్నర కిలోమీటర్ల దూరం వరకు యాత్ర సాగింది. అనంతరం ఆలయంలోని శివ లింగానికి జలాభిషేకం చేశారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

నేరడిగొండ, ఆగస్టు 17: మండలంలోని లఖంపూర్ గ్రామంలో గల హనుమాన్ ఆలయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతో షాలతో ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ఆయలానికి విచ్చేసిన ఎమ్మెల్యేను ఆలయ సభ్యులు శాలువాతో సన్మానించారు. వీరి వెంట దేవేందర్‌రెడ్డి, సురేందర్, శేఖర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌గోండు సేవా సమితి జిల్లా అధ్యక్షుడిగా కొద్దు పటేల్

ఉట్నూర్, ఆగస్టు 17: రాజ్‌గోండుసేవా సమితి జిల్లా కమిటీ ఎన్నికలు శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని గుస్సాడి గుట్టలో నిర్వహించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు పెందూరు ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావులు తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఆత్రం గంగాధర్‌రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గేడం నీరంజన్, ఉపాధ్యక్షుడిగా ఆడమానుకుపటేల్, ఉపాధ్యక్షుడిగా పర్చకి ఆనంద్‌రావు, ఆర్కఓమేష్, ఆత్రం పరశురామ్, కొడప రాదాబాయి, కోశాధికారిగా బొంత ఆశారెడ్డి, కార్యదర్శిగా ముకడే విష్ణు, సంస్కృతి కార్యదర్శిగా మరపా పురుషోత్తం, సభ్యులుగా కొడప సోనేరావు, కత్లెమారుతి, నైతం రాజేశ్‌లు ఎన్నికైన వారిలో ఉన్నారని పేర్కొన్నారు.

బేషరతుగా రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- బీజేపీ నేరడిగొండ మండల నాయకులు

నేరడిగొండ, ఆగస్టు 17: రైతులను తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి మోసం చేసిందని, మోసానికి మరోపేరు కాంగ్రెస్ అని బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లె సంతోష్‌సింగ్ విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ 2లక్షల రుణాలను మాఫీ చేస్తామని ఎన్నికలప్పుడు దొంగ హామీనిచ్చి దొడ్డిదారిన డిసెంబరు 9న గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరా కోతలు పెడుతు కేవలం 46శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తుందని, మొత్తం రుణమాఫీకి రూ.31వేల కోట్లు అవసరమని స్వయాన ముఖ్యమంత్రి చెప్పారని గుర్తు చేశారు. తీరా చూస్తే రూ.17,934 కోట్ల రుణమాఫీ చేసి దగా చేస్తోందని దుయ్యబట్టారు. రుణ మాఫీ జరగని రైతులు పంటలను వదిలి బ్యాంకుల చుట్టు తిరుగుతు ఇటు రుణ మాఫీ జరగక.. అటు పంటలకు సమయానికి మందు పిచాకిర చేయక రెండు విధాలుగా నష్టపోతు నానా ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం లాగే కొంత మందికి రుణమాఫీ చేసి మమ అని చేతు లు దులుపుకుంటుందని ఎద్దెవ చేశారు. భారతీయ జనతా పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి షరతులు లేకుండా రేషన్ కార్డును కాకుండా పట్టాపాస్ పుస్తకాన్ని ప్రామాణికంగా తీసుకుని రుణాలున్న ప్రతిరైతు రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో త్వరలోనే నిరసన కార్యక్రమాలకు దిగుతమని, ప్రభుత్వం స్పందించకుంటే రహదారులను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. రైతులెవరూ అధైర్య పడొద్దని వారికి అండగా బీజేపీ ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

- భీంపూర్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం

భీంపూర్: ప్రభుత్వం తూతూ మంత్రంగా కొద్ది మంది రైతులకే రుణమాఫీ మాత్రమే చేసి చేతులుదులుపుకున్నారని భీంపూర్ మాజీ జడ్పీటీసీ కుమ్ర సుధాకర్ అన్నారు. శనివారం రైతులతో కలిసి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భీంపూర్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రుణ మాఫీకి ఇష్ట పడకనే సాకులు చెబుతుందన్నారు. అర్హులందరికీ రుణ మాఫీ చేయకుంటే ప్రతి రోజు ఆందోళనలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ కుడి మేత రత్నప్రభ సంతోష్, మాజీ రైతు బంధు అధ్యక్షుడు మార్సెట్టి అనిల్, మాజీ బీఆర్ఎస్ మండల కన్వీనర్ సంజీవ్ రెడ్డి, మాజీ సర్పంచులు మాడావి లింబాజీ, బక్కి కపిల్, సయ్యద్ బాధర్, కేమ రాజన్న, ధరం సింగా రాథోడ్, నాయకులు రవీందర్ జాదవ్, షేక్ అఫ్రోజ్, బొంత నితిన్, సంతోష్ రాథోడ్, ఉత్తం రాథోడ్, రాహూఫ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



భీంపూర్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



నేరడిగొండలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బంద్ సక్సెస్

సిరికొండ, ఆగస్టు 17: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ హిందూ సంఘాల పిలుపు మేరకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం చేపట్టిన బంద్ విజయవంతమైంది. వ్యాపారస్తులు, హోటళ్ల యజమానులు స్వచ్ఛందంగా బంద్ పాటించి, మద్దతు తెలిపారు. బంద్ కారణంగా రోడ్లని నిర్మానుష్యంగా మారాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శివాలయం నుంచి పలు వీధుల గుండా తిరుగుతూ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహింద్ పరిషత్ మండల అధ్యక్షుడు లక్కం మల్లేష్, నాయకులు ఒరగంటి పెంటన్న, బోయిన్‌వాడ్ అమోల్, గోర్బండ్ బాలాజీ, పెందూర్ అమృత్‌రావ్, ఎగ్గిడి మల్లేష్, పెందూర్ అనిల్‌కుమార్, బొడ్డు దత్తు, తదితరులు పాల్గొన్నారు.

- ఉట్నూర్‌లో నిరసన ప్రదర్శన

ఉట్నూర్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మతోన్మాద దాడులు నిరసిస్తూ ఉట్నూర్ బంద్ విజయవంతం అయ్యింది. హిందు ఐక్యవేదిక ఇచ్చిన బందు పిలుపు మేరకు ఉట్నూర్ పట్టణంలోని విద్యా సంస్థలు వ్యాపార వాణిజ్య సంస్థలు మూతబడ్డాయి. మండల కేంద్రంలోని హనుమాన్ మందిరం నుంచి హిందూ ఐక్యవేదిక నాయకుల ఆధ్వర్యంలో హిందువులు హాజరై వినాయక్‌చౌక్, అంబేద్కర్ చౌరస్తా వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో మతోన్మాద శక్తులు అక్కడి ప్రభుత్వాన్ని కూల్చివేయడానికి అల్లర్లు సృష్టించి ఆ అల్లర్లలో హిందువులపై దాడులు చేస్తూ హింసను ప్రేరేపిస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని షాంపూ ర్‌లో కూడా అక్కడి హిందూ ఐక్య వేదిక నాయకులు మార్కెట్‌లో బంద్ చేయించారు. ఈ కార్యక్రమంలో రాథోడ్ రితేష్, సాడిగే రాజగోపాల్, షికారిశ్రీనివాస్, గుండాశేఖర్, కొండేరిరమేష్, రాథోడ్‌శేషారావు, కొండగట్టు అంజన్న, మంతెన శ్యాంసుందర్, గొర్రెల నాగన్న, ఠాకూర్‌గోపాల్‌సింగ్, శ్రీపతి లింగగౌడ్, జాదవ్‌సుమాన్‌బాయి,రాణి, గుండాపద్మ, బెంగి వెంకటేశ్, బొడ్డు కిరణ్, సాడి గేరాజేశ్వర్, విజయ్‌కుమార్, రాథోడ్‌విఠల్, హారీష్ తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు చేసుకోకుండా ఉట్నూర్ సీఐ గండి కోట మొగిలి, ఎస్సై మనోహార్‌లు పోలీసు బందోబస్తు మధ్య శాంతియుతంగా ర్యాలీ జరిగేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.



సిరికొండలో నిరసన ర్యాలీలో పాల్గొన్న విశ్వహింద్ పరిషత్ నాయకులు



ఉట్నూర్‌లో నిరసన ప్రదర్శన చేస్తున్న ఆయా సంఘాల నాయకులు



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న పొన్నారి గ్రామస్థులు

ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలి

తాంసి, ఆగస్టు 17: ఈనెల చివరిలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందుతున్నారని, దీంతో తమ పాఠశాలలో ఉపాధ్యాయులు కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున వెంటనే ఉపాధ్యాయులను నియమించాలంటూ పొన్నారి గ్రామస్థులు శనివారం మండల విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోనే తమ పాఠశాల అత్యుత్తమ ఫలితాలను సాధిస్తుందని, విద్యార్థులు హాజరు శాతం కూడా ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత ఉపాధ్యాయులు రాకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కొరత లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రఘు, రమణ, గడుగు గంగన్న, మల్లయ్య, విలాస్, చిన్నయ్య, పలువురు గ్రామస్థులు యువకులు, తదితరులు ఉన్నారు.

భీంపూర్ ఏవోగా శ్రీనివాస్‌రెడ్డి

భీంపూర్, ఆగస్టు 17: మండల వ్యవసాయ అధికారిగా శ్రీనివాస్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను మండల నాయకులు, రైతులు భీంపూర్ అంగడి బజార్‌లో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతు బంధు అధ్యక్షుడు మార్సెట్టి అనిల్, మాజీ సర్పంచ్ మడావి లింబాజీ , కేమ రాజన్న, మాజీ ఉప సర్పంచ్ మడా వి లింబాజీ, కేమ రాజన్న, మాజీ ఉప సర్పంచ్ రవీందర్ జాదవ్, నాయకులు తదితరులున్నారు.

అంతర్గత రోడ్డుపై రేకులషెడ్డు తొలగింపు

ఇచ్చోడ, ఆగస్టు, 17: ఇచ్చోడ మేజర్ గ్రామ పంచాయతీలో కొంత మంది నాయకుల అండ చూసుకొని అంతర్గత రోడ్డును కబ్జా చేసి ఆ రోడ్డుపై రేకుల షెడ్డును ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ విషయమై శనివారం గ్రామ పంచాయతీ ఈవో సూర్యప్రకాష్ రోడ్డుకు అడ్డంగా ఉన్న తాత్కాలిక రేకులషెడ్డును దగ్గరుండి తొలగించారు. షెడ్డు వేసిన స్థలం తమదని కొందరూ నాయకులు ఈవో దృష్టికి విషయాన్ని తీసుకురాగా.. దానికి సంబంధించిన నిజపత్రాలను గ్రామ పంచాయితీకి చూపించాలన్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

సహకార సంఘం రికార్డుల సీజ్

బోథ్, ఆగస్టు 17: సహకార సంఘంలో రికార్డులను శనివారం సాయంత్రం జిల్లా ఆడిట్ ఆఫీసర్ అరుణ రికార్డులను సీజ్ చేశారు. శుక్రవారం బోథ్ సహకార సంఘంలో సమావేశాలు నిర్వహించకుండా పలు రకాల అక్రమాలు జరిగాయని పలువురు డైరెక్టర్లు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన అధికారులు సహకార సంఘంలోని పలు రికార్డులను పరిశీలించారు. పలువురు డైరెక్టర్లు చేసిన ఫిర్యాదు మేరకు రికార్డులను సీజ్ చేసి తీసుకెళ్లారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- 10మంది పేకాటరాయుళ్ల పట్టివేత
- రూ.57,690 నగదు, 12 సెల్ ఫోన్లు స్వాధీనం

భైంసా, ఆగస్టు17: పట్టణ పరిధిలోని నాందేడ్ క్రాస్ రోడ్డు సమీపంలో గల మూతపడ్డ ఓ జిన్నింగ్ ఫ్యాక్టరీలో కొనసాగుతున్న పేకాటస్థావరంపై శనివారం మధ్యాహ్నం పోలీసులు దాడిచేశారు. భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ సారధ్యంలో టౌన్ ఎస్సైలు షరీఫ్, గౌస్‌లు ఆకస్మికంగా దాడిచేపట్టారు. ఇందులో 10మంది పేకాటరాయుళ్లు పట్టుబడగా మరో ఇద్దరు పేకాటరాయుళ్లు పోలీసు అధికారులను చూసి పారిపోయినట్లుగా తెలిసింది. దాడిలో 57,690 నగదుతోపాటు 12 సెల్‌ఫోన్లు, ఒక కారు, మరో మూడు బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లలో భైంసా పట్టణ, మండల పరిధిలోని పలువురు ప్రముఖ రాజకీయ నాయకులు, వ్యాపారస్తులు ఉన్నారు. ఏఎస్పీ అవినాష్ కుమార్ పేకాట స్థావరం కొనసాగుతున్న మూతపడ్డ జిన్నింగ్ ఫ్యాక్టరీ యజమానిని పట్టుకొని విచారించగా బీజేపీ కార్యాలయం కోసం తాను గదిని అద్దెకు ఇచ్చినట్లుగా వెల్లడించారు. అద్దెకు సంబంధించి లిఖితపూర్వకంగా రాసుకున్న పత్రాలు ఏవైనా చూపించాలని డిమాండ్ చేయగా అలాంటి పత్రాలేవి తాము రాసుకోలేదని, మాటపైనే ఇచ్చామని వివరించారు. బీజేపీకి చెందిన ఓ నాయకుడు సంబంధిత పేకాటస్థావరాన్ని నిర్వహిస్తున్నట్లుగా పోలీసు అధికారుల విచారణలో వెల్లడైనట్లుగా తెలిసింది. పట్టుబడిన పేకాటరాయుళ్లను పోలీసు వాహనాల్లో టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ఆదిలాబాద్‌లో జూడాల ఆందోళనలు ఉధృతం

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 17: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచార ఘటన నిరసిస్తూ జుడాలు నాలుగు రోజులుగా చేపట్టిన ఆందోళనలు శనివారం మరింత తీవ్రతరం చేశారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షాను రిమ్స్ జూనియర్ డాక్టర్లు కలిశారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు ఆయనకు రాఖీలు కట్టారు. జుడాలు వైద్య కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిపై మానవహారం ఏర్పాటు చేసి రాస్తారోకో చేపట్టారు. ఈ సంఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వెంటనే రాజీనామా చేయాలన్నారు. జుడాల ఆందోళనకు ఐఎంఏ, స్టాఫ్ నర్సుల సంఘం, మెడికల్ రిప్రజెంటెటివ్ సంఘం మద్దతు ప్రకటిస్తూ ఆందోళనలో పాల్గొన్నారు.

● **మహిళలకు రక్షణ కల్పించాలి**

దేశంలో మహిళలకు రక్షణ కరువైందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ ఆరోపించారు. కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారం ఘటనను నిరసిస్తూ జుడాలు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా సీఐటీయూ నాయకులు శనివారం రిమ్స్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఇందులో రిమ్స్ పారిశుధ్య కార్మికులు భద్రతాసిబ్బంది సైతం పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

● **ప్రైవేటు ఆస్పత్రుల్లో నిలిచిన ఓపీ సేవలు**

కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా ఆదిలాబాద్ ఐఎంఏ (దస్నాపూర్ శాఖ) ఆధ్వర్యంలో శనివారం ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ సేవలను నిలిపివేశారు. పట్టణంలోని అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో అత్యవసర సేవలు మినహా ఓపీ సేవలన్నీ నిలిపివేశారు. ఓపీ సేవలు నిలిపివేస్తున్నట్లు ఆస్పత్రుల ఎదుట బోర్డులు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 6గంటల వరకు ఓపీ సేవలను నిలిపివేస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అశోక్, శ్యాం ప్రసాద్ తెలిపారు.



ఆదిలాబాద్ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న జూడాలు

● **హత్యాచార ఘటన నిందితులను శిక్షించాల్సిందే..**

ఇచ్చోడ: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన నిరసిస్తూ ఇచ్చోడ మండల వైద్యులు, ప్రజలు, ఆయా సంఘాల సభ్యులు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి గ్రామంలోని ప్రధాన రహదారిపై కొవ్వొత్తుల ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేసుకుంటూ ఊరంతా శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఇచ్చోడ వైద్యులు రవిరాథోడ్, దశరథ్, మనోహర్, కిషోర్, గజానంద్, మహేష్, సాయి కృష్ణ, విజయ్, మహేందర్, శ్రీనివాస్, నాని, నాందేవ్, రవి పాల్గొన్నారు.

● **ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి**

భోథ్: కోల్‌కత్తా ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం జరిపి హత్యకు పాల్పడ్డ సంఘటన తీవ్రమైందని ఇలాంటి నేరాలు ఘోరాలు జరుగకుండా ప్రభుత్వం హంతకులను పట్టుకుని తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం మండల కేంద్రంలో విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు నిరసన ర్యాలీ చేపట్టారు. అలాగే, కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేయడాన్ని నిరసిస్తూ శనివారం బోథ్ ప్రభుత్వ వైద్యులతో పాటు ఆర్ఎంపీ వైద్యులు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ర్యాలీ నిర్వహించి బోథ్‌లో తమ నిరసన వ్యక్తపరిచారు.

ఇంద్రవెల్లి: కోల్‌కత్తాలో విధుల్లో ఉన్న డాక్టర్‌పై హత్యాచారం చేసి, హత మార్చిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఆర్ఎంపీ డాక్టర్ల సంఘం మండల అధ్యక్షుడు చోలే రణవీర్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 17: సీజనల్ వ్యాధుల నివారణకు ప్రైవేట్ వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని, వైద్యం అందించడంలో నైతిక విలువలు పాటించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రైవేట్ వైద్యులతో సీజనల్ వ్యాధుల నివారణ, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010పై సమీక్ష సమావేశం నిర్వహించారు. రోగులకు డెంగ్యూ ర్యాపిడ్ టెస్ట్ చేసినా పరీక్షలో నిర్ధారణ అయితేనే పాజిటివ్‌గా పరిగణించాలని సూచించారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవియ, డీఎంహెచ్‌కే కె.కృష్ణ, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, ఐఎంఏ అధ్యక్షుడు అశోక్, ఏజెన్సీ అదనపు డీఎంహెచ్ కుడ్మెత మనోహర్, డిప్యూటీ డీఎంహెచ్ సాధన, ప్రోగ్రాం అధికారి ఎం.శ్రీధర్ పాల్గొన్నారు.

గిరిజనేతరుల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి : ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, ఆగస్టు 17: ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో అటవీ భూముల్లో సాగు చేసుకుంటున్న గిరిజనులతో పాటు గిరిజనేతరులకు కూడా పోడు పట్టాలు ఇవ్వాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను కోరారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఎమ్మెల్యే బొజ్జు పాల్గొని నియోజకవర్గంలో నెలకొన్న అటవీ శాఖ సమస్యలను మంత్రికి వివరించారు. గిరిజనుల పోడు భూముల సమస్య ఇంకా పరిష్కారం కాలేదని అనేక మంది గిరిజన రైతులకు పోడు పట్టాలు అందలేదని వివరించారు. గిరిజనేతర రైతులు కూడా అటవీ భూముల్లో సాగులో ఉన్నారని వారికి కూడా పోడు పట్టాలు ఇచ్చే విషయంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని కోరారు. కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో భారీ వాహనాల ప్రవేశాన్ని నిషేధించారని దీంతో వ్యాపార, వాణిజ్య రంగాలపై తీవ్ర ప్రభావం పడుతుందని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. భారీ వాహనాలను అనుమతించక పోవడంతో సరుకులు తరలింపులో వ్యాపారాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇందులో మంత్రి సీతక్కతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మత ప్రచారాన్ని అడ్డుకున్న యువకులు

తాంసి ఆగస్టు 17: మండల కేంద్రమైన తాంసిలో శనివారం క్రైస్తవ మత ప్రచారాన్ని నిర్వహించేందు కోసం ప్రత్యేక బృందం వచ్చింది. అయితే, ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామ యువకులు మత ప్రచారాన్ని అడ్డుకున్నారు. అంతేకాకుండా గ్రామంలోకి వచ్చిన క్రైస్తవులను ఎందుకు వచ్చారు? అంటూ నిలదీశారు. ఇంటింటికి వెళ్లి ఎందుకు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో ప్రచారం కోసం వచ్చిన క్రైస్తవులు బైబుల్‌పై ఒట్టేసి చెబుతున్నాం ఒక నుంచి మీ గ్రామానికి రాము ప్రచారం నిర్వహించము మమ్మల్ని వదిలేయండి అని ప్రాధేయపడ్డారు. దీంతో ఏకీభవించిన గ్రామ యువకులు వారిని వదిలి పెట్టారు. ఈ విషయం దావానంలా పాకడంతో పెద్దఎత్తున యువకులు, గ్రామస్థులు అక్కడికి చేరుకునేసరికి వారు పరారయ్యారు.

పంచాయతీ సెక్రెటరీపై సస్పెన్షన్‌వేటు

నార్నూర్, ఆగస్టు 17: ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ శుక్రవారం మండల కేంద్రంలో ఉన్న 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, ఏకలవ్య ఆదర్శ పాఠశాలల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్యం లోపం విధుల పట్ల నిర్లక్ష్యం వ్యవహారంపై పంచాయతీ సెక్రటరీ ఆర్.దినేష్‌ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు చేశారు. ఇతర అధికారులపై చర్యలు తీసుకున్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

తలమడుగు, ఆగస్టు 17: తలమడుగు మండలం లింగి గ్రామానికి చెందిన రాగి దినేష్(31) అనే వ్యక్తి సంతానం కావడంలేదని మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు దినేష్ ఈనెల 3న పురుగుల మందు తాగి ఆత్మ హత్యాయత్నం చేయగా.. గమనించిన సభ్యులు వెంటనే అంబులెన్స్‌లో ఆదిలాబాద్ లోని రిమ్స్ హాస్పటల్‌కి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో మరణించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఏడు సంవత్సరాల క్రితం పెళ్లి జరగగా ఇప్పటివరకు పిల్లలు కాకపోవడంతో మద్యానికి బానిసై చేను పనులకు వెళ్లకుండా జులాయిగా తిరుగుతూ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. భార్య రాగి రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భైంసాలో హిందూ ఐక్యవేదిక బంద్ విజయవంతం



భైంసాలో మూసి ఉన్న వ్యాపార సంస్థలు.. కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ తదితరులు

భైంసా, ఆగస్టు 17 : బంగ్లాదేశ్‌లో హిందువుల పై జరుగుతున్న దాడులు, మహిళలపై జరుగుతున్న పాశవిక ఘటనలు, దేవాలయాల ధ్వంసం తదితర చర్యలను నిరసిస్తూ శనివారం భైంసాలో హిందూ ఐక్యవేదిక చేపట్టిన బంద్ విజయవంతం అయ్యింది. పట్టణ పరిధిలోని ఒక వర్గానికి అన్ని రకాల వ్యాపార,వాణిజ్య సంస్థలు, విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్‌ను పాటించాయి. దీంతో నిత్యం క్రయ,విక్రయాలతో కళకళలాడే భైంసా మార్కెట్ వెలవెలబోయి కనిపించింది. బస్సులు యదావిధిగా నడిచినప్పటికి ప్రయాణీకుల రాకపోకలు అంతంత మాత్రంగానే కొనసాగడంతో భైంసా బస్టాండ్ బోసిపోయి కనిపించింది. బంద్‌లో భాగంగా రాత్రి 7.30 గంటల ప్రాంతంలో హిందూ ఐక్యవేదిక కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించింది.స్థానిక పద్మావతి కాలనీ పరిధిలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన కొవ్వొత్తుల ర్యాలీ బస్టాండ్ ఎదుట గల బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఇందులో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, ఆర్ఎస్ఎస్ నగర సంచాలక్ సాధుల కృష్ణదాస్, విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు గుజ్జల్‌వార్ వెంకటేష్, డా.మహిపాల్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెండెపు కాశీనాథ్, సిందే కపిల్‌తో పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, పాటు వివిధ సంఘాల ప్రతినిధులు,రాజకీయ పార్టీల శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బంగ్లాదేశీయుల దాడిలోని మృతులకు నివాళులర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రతినిధులు బంగ్లా దేశీయుల దుశ్చర్యలను ముక్తకంఠంతో ఖండించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దారుణ ఘటనలను అరికట్టేందుకు, రక్షణ కల్పించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బంద్ కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు గాను పోలీసు శాఖ భారీ బందోబస్తు చర్యలు చేపట్టింది. ప్రధాన కూడలీలు, సమస్యాత్మక, వివాదస్పద ప్రాంతాలతో పాటు ఆలయాలు, ప్రార్థన మందిరాల వద్ద పికెట్లను ఏర్పాటు చేశారు.

లోకేశ్వరం రూరల్ : బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందూవాహిని పిలుపు మేరకు మండల కేంద్రం లోకేశ్వరంతో పాటు రాజు, తదితర గ్రామాల్లో శనివారం బంద్ ప్రశాంతంగా జరిగింది. గ్రామాల్లోని దుకాణా సముదాయాలు, ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ఈ కార్యక్రమంలో హిందూవాహిని, బీజేవైఎం నాయకులు నల్ల సురేష్, వినీత్, రాజు, రాకేష్, వినోద్, సంజయ్, ఆదిత్య, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనను నిరసిస్తూ వైద్యుల ర్యాలీ

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 17 : కోల్‌కతాలో జూనియర్ మహిళా డాక్టర్‌పై అత్యాచార ఘటనను నిరసిస్తూ నిర్మల్ జిల్లా కేంద్రంలో శనివారం వైద్యులు నిరసన ర్యాలీ నిర్వహించారు. మంచిర్యాల చౌరస్తా నుంచి శివాజీచౌక్ వరకు వందలాది మంది ఊరేగింపులో పాల్గొన్నారు. ఐఎంఏ, ఎన్‌డీఏ, ఐడీఏ, డ్రగ్గిస్ట్స్, కెమిస్ట్స్, మెడికల్ రిప్రజెంటేటివ్ తదితర సిబ్బంది స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీలకు వినతి పత్రాన్ని అందజేశాయి. బాధిత డాక్టర్ కుటుంబానికి సత్వర న్యాయం జరగాలని, దోషులను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. వ్యవస్థలు, చట్టాల్లో స్త్రీ రక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. అన్ని ఆసుపత్రులలో ఓపీ సేవలు నిలిపి వేశారు. ఆదివారం ఉదయం 6 గంటల వరకు సేవలు నిలిపి వేస్తున్నట్లు ప్రకటించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మురళీధర్, వైద్యులు అప్పాల చక్రధారి, దామెర రాములు, ప్రధాన కార్యదర్శి ప్రమోద్ చంద్రా రెడ్డి, యు. కృష్ణంరాజు టీడీఏ అధ్యక్షుడు హన్మంతు, ఆర్ఎం పీ సంఘ అధ్యక్షుడు అజారుద్దీన్, కంపౌండర్ల సంఘ అధ్యక్షుడు శ్రీధర్ రాజు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

భైంసా : భైంసాలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, డాక్టర్స్ అసోసియేషన్ చేపట్టిన నిరసనలు హోరెత్తాయి. ఈ సందర్భంగా పట్టణంలోని డాక్టర్స్ అసోసియేషన్ భవన్ నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ ప్రధాన వీధుల మీదుగా ఆర్‌డీవో కార్యాలయం, బస్టాండ్ వరకు కొనసాగింది. ఐఎంఏ భైంసా డివిజన్ అధ్యక్షులు డా.రాజేశ్వర్‌రావ్, ప్రధాన కార్యదర్శి డా.సూర్యకాంత్ రెడ్డి, భైంసా డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డా.దామోదర్ రెడ్డి, డా.కుమార్ యాదవ్‌ల నేతృత్వంలో వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు. ఆర్‌డీవో కార్యాలయానికి ర్యాలీగా తరలివెళ్లి సంబంధిత ఘటన ఖండిస్తూ నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందచేశారు.

ముథోల్ : ముథోల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, గ్రామీణ డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, గ్రామీణ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.9। కనిష్ఠం 25.6
నిర్మల్ జిల్లా వార్తలు
8
ఆదివారం 18 ఆగస్టు 2024





ప్రాజెక్టులకు పూడిక శాపం

- జిల్లాలోని ప్రాజెక్టుల్లో పెరిగిపోయిన మట్టి పూడిక
- తగ్గిపోతున్న నీటి నిల్వ సామర్థ్యం
- చివరి ఆయకట్టు భూములకు అందని చివరి తడి
- సర్కారు నిర్ణయంతో ప్రాజెక్టులకు పూర్వ వైభవం వచ్చేనా ?

నిర్మల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఇరిగేషన్ ప్రాజెక్టులు, కాలువల్లో పేరుకుపోయిన పూడిక విషయంపై నెలకొన్న నిర్లక్ష్యం సాగునీటి రంగానికి శాపంగా మారుతోంది. అలాగే ఆనకట్టలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయకపోవడంతో వాటి బాధ్యత ప్రశ్నార్థకమవుతోంది. ఈ నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టులన్నీ సహజ భద్రత కోల్పోతున్నాయి. ఇప్పటికే చాలా ఇరిగేషన్ ప్రాజెక్టులకు భద్రత లేక ప్రమాదపుటంచునకు చేరుకుంటున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెడుతుండడమే కాకుండా నిధులను సైతం మంజూరు చేసేందుకు సిద్ధమవుతుండడంతో పూడికతో నిండిపోయిన రిజర్వాయర్లకు ఇక మహర్దశ పట్టనుందనే అంచనాలతో ఆయకట్టు రైతులు ఆనందిస్తున్నారు. పూడికతీత పనులకు రాష్ట్రప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ జారీ చేయడమే కాకుండా తీసిన పూడికను రైతుల పంట పొలాలకు ఇతర అవసరాలకు ఉచితంగా వినియోగించుకునే అవకాశం కల్పించబోతున్నట్లు ప్రకటించింది. దీంతో చాలా మంది రైతులు ఇక స్వచ్ఛందంగా పూడికను తీసుకువెళ్ళే అవకాశం ఏర్పడుతోంది. దీంతో పాటు సంబందిత ప్రాజెక్టు అధికారులు సైతం పూడికతీత పనులు చేపట్టేందుకు మార్గం సుగమం అవుతుంది.

అటకెక్కిన గత ప్రతిపాదనలు...

కాగా గతంలో రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులపై కేంద్ర జల సంఘం ద్వారా నివేదికలు సేకరించినప్పటికీ కేంద్రప్రభుత్వం ఇక్కడి 29 ఇరిగేషన్ ప్రాజెక్టులను వరల్డ్‌బ్యాంకు ఫండింగ్ కోసం ప్రతిపాదించింది. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న డ్యాం రిహాబిలిటేషన్ ఇంప్లిమెంటేషన్ ప్రాజెక్టు (డ్రిప్) కింద రాష్ట్ర ప్రాజెక్టులను చేర్చింది. దేశ వ్యాప్తంగా డ్రిప్ పథకం కింద 21 రాష్ట్రాలలోని 736 డ్యామ్‌లను రక్షణ పనుల కోసం ఎంపిక చేశారు. దీని కోసం గానూ 10,211 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో డ్రిప్ కింద మొత్తం 29 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. దీని కోసం గానూ 645 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు రూపొందించారు. అయితే ఇప్పటి వరకు ఈ ప్రతిపాదనలు ఆచరణకు నోచుకోలేదు. ముఖ్యంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా చొరవ తీసుకోకపోవడంతో ఆ ప్రతిపాదనలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయన్న విమర్శలున్నాయి.

అసలు ముప్పు పూడికతోనే..

సాగునీటి ప్రాజెక్టులకు పూడిక ముప్పుగా మారుతోంది. ప్రతీఏటా రిజర్వాయర్‌లలోకి వరదనీరు ప్రవాహంతో పూడిక పెద్ద ఎత్తున వచ్చి చేరుతోంది. ఈ పూడిక కారణంగా రిజర్వాయర్‌లలో నీటిమట్ట లెక్కలు కూడా తలకిందులవుతున్నాయి. గతంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో టెలిమీటర్ల ద్వారా పూడిక లెక్కలు నిర్ధారించారు. ఈ ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 91 టీయంసీలు కాగా దాదాపు 25 టీఎంసీలకు పైగా పూడిక చేరుకున్నట్లు కేంద్రజల సంఘం అధికారులు అప్పట్లో తేల్చారు. అలాగే జిల్లాలోని కడెం, గడ్డెన్న వాగు ప్రాజెక్టులలో కూడా పూడిక పెద్ద ఎత్తున వరదనీరుతో వచ్చి చేరుతోంది. మహారాష్ట్ర వైపు నుంచి ప్రాజెక్టు రిజర్వాయర్‌లోకి వచ్చే వరద నీటితో నల్లమట్టి బురద తరలివస్తోంది. పూడికను ప్రాజెక్టుల్లోకి రాకుండా నివారించడానికి గతంలో బ్యాక్‌వాటర్ పరిధిలో సిల్ట్ అరెస్ట్ ట్యాంకులు నిర్మించారు. వీటితో కూడా ప్రయోజనం లేకుండా పోయింది. కుప్పలు తెప్పలుగా పూడిక రిజర్వాయర్‌లలోకి చేరుకుంటున్న కారణంగా నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుందంటున్నారు. ఒక రిజర్వాయర్ నుంచి పూడిక తీయడానికి అయ్యే వ్యయంతో మరో మినీ ప్రాజెక్టును నిర్మించవచ్చని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. దీని కారణంగా పూడిక తీయడం లేదని ఏటేటా పూడికశాతం పెరుగుతుండడంతో ప్రాజెక్టు పరిస్థితి ఆందోళనకరంగా మారుతోందని అంటున్నారు.

ప్రాజెక్టులకు పూడికే పెద్ద సమస్య

ప్రాజెక్టులకు పూడిక ఓ సమస్యగా మారింది. కడెం ప్రాజెక్టులోకి ఎగువ నుంచి ప్రతియేటా ఎక్కడా లేని విధంగా పెద్ద మొత్తంలో పూడిక చేరుకుంటున్నది. పూడిక నివారణపై పకడ్బందీ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఆధునిక సాంకేతిక నైపుణ్యంతో పూడికను అరికట్టే దిశగా ప్రణాళికలను రూపొందించాల్సిన అవసరం ఉంది.

- సత్యనారాయణ,
మాజీ ఇంజనీర్,
ఇరిగేషన్ ఎక్స్‌ఫర్ట్









స్వర్ణ ప్రాజెక్టు | కడెం ప్రాజెక్టు | గడ్డన్న ప్రాజెక్టు

ఎడ్లబండి పై నుంచి పడి బాలుడి మృతి

- మొక్కజొన్నకు మందు వేసేందుకు వెళ్తూ తనతో పాటు కుమారుడిని తీసుకెళ్లిన తల్లి
- మార్గమధ్యలో ఎడ్లబండి పైనుంచి కింద పడిన బాలుడు
- బాలుడిపై ఎక్కిన బండి చక్రాలు
- అక్కడికక్కడే మృతి చెందిన బాలుడు


ప్రణయ్ (ఫైల్)

ఖానాపూర్, ఆగస్టు 17 : ఇంటి వద్ద ఎవరూ లేకపోవడంతో తనతో పాటు తన కుమారుడిని వెంటబెట్టుకుని పంట చేలలోకి మందు వేయడానికి వెళ్లిన ఆ తల్లికి ఆ ప్రయాణం తీవ్ర గుండెపోతను మిగులుస్తుందని ఊహించలేకపోయింది. మొక్కజొన్నకు మందు వేయడానికి వెళ్తున్న తల్లి తన వెంట కుమారుడిని సైతం ఎడ్లబండిపై కూర్చోబెట్టుకొని వెళ్తుండగా ప్రమాదవశాత్తు బండిపై నుంచి కింద పడి బాలుడు మృతి చెందిన హృదయ విదారకమైన ఘటన ఖానాపూర్ మండలం సింగపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కడెం ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన కథనం ప్రకారం... సింగపూర్ గ్రామానికి చెందిన వరిగడ్డి పద్మ అనే మహిళ తమ వ్యవసాయ క్షేత్రంలో వేసిన మొక్కజొన్న పంటకు ఎరువులు (యూరియా) వేసేందుకు శనివారం ఎడ్ల బండిపై యూరియా బస్తాలను వేసుకుంది. అదే సమయంలో ఇంటి వద్ద ఎవరూ లేకపోవడంతో తన రెండున్నరేళ్ల కుమారుడు ప్రణయ్‌ని తనతో పాటే తీసుకెళ్లాలని ఎడ్లబండిపై ఎక్కించుకొని తానే స్వయంగా బండిని తోలుతూ వెళ్లింది. ఇంతవరకు బాగానే ఉన్నా మార్గమధ్యంలో ఎడ్ల బండి ఒక బండరాయిపై ఎక్కడంతో ప్రమాదవశాత్తు చిన్నారి బాలుడు ప్రణయ్‌బండి పైనుండి కిందపడ్డాడు. కింద పడిన బాలుడి పైనుంచి ఎడ్ల బండిచక్రాలు ఎక్కి దిగడంతో తీవ్ర గాయాలతో ప్రణయ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఇంటి వద్ద ఒంటరిగా కుమారుడిని వదల లేక అతని రక్షణ కోసం తీసుకెళ్లిన కన్నతల్లి ఎదుటే బాలుడు బండి పైనుండి కింద పడి విలవిల్లాడుతూ ప్రాణాలు వదిలేయడంతో ఆ తల్లి తల్లడిల్లింది. ముక్కుపచ్చలారని ఆ చిన్నారి బాలుడు బండి కింద పడి మృతి చెందిన ఘటన సింగపూర్ గ్రామంలో విషాదఛాయలను నింపింది. తమ కుమారుడి కోసం తల్లి దప్మతో పాటు తండ్రి గంగాధర్ వారి కుటుంబ సభ్యులు రోదించిన తీరు ప్రతి ఒక్కరినీ కదిలించింది. ఈ మేరకు ప్రణయ్ తండ్రి గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి పేర్కొన్నారు.

నాలుగు ఇళ్లల్లో దొంగతనం

- రూ. లక్ష యాభై వేల నగదు, వెండి ఆభరణాల అపహరణ


దొంగలు పగలగొట్టిన బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

ఖానాపూర్, ఆగస్టు 17 : ఖానాపూర్ పట్టణంలో శుక్రవారం రాత్రి నాలుగు ఇళ్లలో దొంగతనం జరిగింది. వివరాల్లోకి వెళ్తే ఎస్సై లింబాద్రి తెలిపిన కథనం ప్రకారం... కాగజ్‌నగర్‌కు చెందిన జడల కుమారస్వామి అనే వ్యక్తి శుక్రవారం ఉదయం 6 గంటలకు తన ఇంటికి తాళం వేసి కాగజ్‌నగర్ వెళ్లారు. దీంతో రాత్రి సమయంలో గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న రూ.లక్ష యాభై వేల నగదును దొంగిలించారు. ఆ ఇంటికి సమీపంలోని పక్క పోర్షన్‌లో ఉంటున్న పెంబి మాజీ జడ్పీటీసీ భూక్యా జానుబాయి ఇంటికి సైతం తాళం వేసి ఉండడంతో దొంగలు ఆ ఇంటి తాళాన్ని పగలగొట్టి రూ.3,200ల విలువ గల వెండి ఆభరణాలను దొంగిలించారు. అదే కాలనీలోని మరోరెండు ఇళ్లలో కూడా దొంగతనానికి ప్రయత్నించినప్పటికీ ఆ ఇళ్లలో ఎటువంటి విలువైన వస్తువులు గాని నగదు గాని దొంగలించబడలేదని ఇంటి యజమానులు తెలిపినట్లు ఎస్సై పేర్కొన్నారు. జడల కుమార స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లాల్సిన పరిస్థితి వస్తే కచ్చితంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు. ఒకవేళ సమాచారం ఇవ్వలేకపోతే ఇంట్లో నగదు గాని విలువైన ఆభరణాలు గాని ఉంచవద్దని సూచించారు.

ఖానాపూర్‌లో అదనపు కలెక్టర్ విచారణ


అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

ఖానాపూర్, ఆగస్టు 17 : ఖానాపూర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ శనివారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని విద్యానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ నిర్వహించారు. పలు రికార్డులను పరిశీలించిన అదనపు కలెక్టర్ విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికరమైన భోజనాన్ని అందజేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం ఇటీవల ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఖానాపూర్ శివాజీ నగర్‌లో నిర్మిస్తున్న ఓ భవనంపై వచ్చిన ఫిర్యాదుపై విచారణ నిర్వహించారు. శివాజీ నగర్ కాలనీలో నిర్మిస్తున్న సదరు భవనాన్ని పరిశీలించారు. ఆయన వెంట స్థానిక మున్సిపల్ చైర్మన్ సత్యం, వైస్ చైర్మన్ సంతోష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, కౌన్సిలర్లు కిషోర్ నాయక్, అబ్దుల్ ఖలీల్, కాంగ్రెస్ నాయకులు జన్నారపు శంకర్, అమానుల్లా ఖాన్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోష్, తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

భైంసా, ఆగస్టు 17 : పట్టణ పరిధిలోని జాతీయ రహదారి పై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు తీవ్ర గాయల పాలయ్యారు. భైంసా నుంచి నిర్మల్ వైపు వెలుతున్న అర్‌టీసీ బస్సు, స్థానిక పిప్రి కాలనీ అంతర్గత రోడ్డు నుంచి డివైడర్ వద్ద జాతీయ రహదారి పైకి వచ్చిన ఆటో ఢీ కొట్టుకోవడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న లక్ష్మణ్ (34), ఆయన భార్య సోని (27), కూతురు చిన్నారి మౌనిక (1) తీవ్ర గాయాల బారిన పడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఇక్కడి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సలు నిర్వహింపచేశారు. భైంసా పట్టణ పోలీసులు ప్రమాద స్థలిని పరిశీలించి, బాధిత కుటుంబీకుల నుంచి ప్రమాద వివరాలను సేకరించారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

భైంసా రూరల్, ఆగస్టు 17 : మండలంలోని మహాగాం గ్రామంలో శనివారం కదం బాలాజీ(48) మద్యానికి బానిసై ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మహాగాం గ్రామానికి చెందిన కదం బాలాజీ పటేల్ గత కొద్ది రోజుల నుంచి మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెందిన తన ఇంటి తోటలో వేపచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

పోడు భూముల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలి

రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

నిర్మల్ అర్బన్, ఆగస్టు 17 : పోడు భూముల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి పోడు భూముల సమస్యలను పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, అటవీ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులతో పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్కతో కలిసి ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పోడు భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ఎజెండాను రూపొందించుకొని సాగు చేస్తున్న పోడు భూముల హద్దులు, అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. అనర్హులు అటవీ భూములను ఆక్రమించుకోకుండా చర్యలు చేపట్టాలన్నారు. అటవీ, గిరిజన శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి పోడు భూముల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం జిల్లాల వారీగా పోడు భూముల పట్టాల కోసం ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు, తదితర అంశాలపై చర్చించారు. అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ... పోడు భూముల సమస్యలు పరిష్కరించేందుకు అటవీ, గిరిజన సంక్షేమ శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు పోడు పట్టాల కోసం మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు, సంబంధిత వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోడు భూములు సాగు చేస్తున్న గ్రామాలకు సంబంధిత వివరాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, డీటీడీవో అంబాజీ, డీపీవో శ్రీనివాస్, అటవీశాఖ సూపరిండెంట్ అరుణ్‌కుమార్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ఓటరు నమోదు, ఇంటింటి సర్వేకు సన్నద్ధం కావాలి

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 17 : జిల్లాలో ఓటరు నమోదు కోసం ఇంటింటి సర్వే నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శనివారం ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కలెక్టర్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఈసీ ఆదేశాలు వివరించారు. ఈ నెల 20 నుండి ఓటర్ల వివరాల నమోదుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా సోమవారం నుండి రెండు రోజుల శిక్షణ ఇవ్వాలని సూచించారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించి వివరాలు ఎప్పటికప్పుడు వారికి కేటాయించిన ట్యాబ్‌లలో నమోదు చేయాలన్నారు. మరణించిన, చిరునామా మారిన, ఇతర చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్న వివరాలను పరిశీలించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి : ఎస్పీ జానకీషర్మిల


రేడియో సెట్‌తో సమీక్షిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 17 : జిల్లాను డ్రగ్స్‌రహితంగా తీర్చిదిద్దాలని ఎస్పీ జానకీషర్మిల పోలీసుశాఖ ఉన్నతాధికారులు, పోలీసులకు సూచించారు. శనివారం డీజీపీ జితేందర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీసు అధికారుల నుంచి క్రింది స్థాయి సిబ్బందితో రేడియో సెట్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. పలు ఆదేశాలు జారీ చేశారు. సామాన్యులకు భరోసా కలిగించే విధంగా సేవలుండాలన్నారు. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన పోలీసులు అనైతిక చర్యలకు పాల్పడితే కఠిన, క్రమశిక్షణ చర్యలుంటాయని హెచ్చరించారు. వినాయక చవితి పండగ దృష్ట్యా ముందస్తుగా అన్ని కమిటీలతో విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో కఠినంగా వ్యవహరించాలని, నేరాల నియంత్రణకు ప్రత్యేకచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ కేసులు దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. త్వరితగతిన పరిష్కరించేలా చర్యలుండాలన్నారు. జిల్లాలో డ్రగ్స్ అక్రమ రవాణా అరికట్టాలని అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుండి వచ్చే గంజాయి సరఫరా మూలాలను, కీలక వ్యక్తులను గుర్తించి కేసులు నమోదు చేయాలని సూచించారు. పేకాట, గుడుంబా, పీడీఎస్ బియ్యం, తదితర వాటిపై నిఘా పెట్టి దాడులు నిర్వహించాలని ఆదేశించారు. సీసీ కెమెరాల పనితీరు పర్యవేక్షణ, ఆయుధ లైసెన్స్ జారీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు సంబంధించిన కేసులు పరిష్కారంపై దిశానిర్దేశం చేశారు.

ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సైలు

నిజామాబాద్ జిల్లా నుంచి ఇటీవల జిల్లాకు బదిలీపై వచ్చిన ఎస్సైలు శనివారం ఎస్పీ జానకి షర్మిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీకి మొక్కను అందజేశారు. లోకేశ్వరం ఎస్సై అశోక్, భైంసా రూరల్ ఎస్సై శ్రీనివాస్ ఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు.

మలక్ చించోలి గ్రామంలో విషజ్వరాలు

సారంగాపూర్, ఆగస్టు 17 : మండలంలోని మలక్ చించోలి, జామ్ తదితర గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలి ప్రజలు అవస్థల పాలవుతున్నారు. వ్యాధి సోకిన వారు స్థానిక ఆర్‌ఎంపీ వైద్యులను సంప్రదించి చికిత్సలు పొందుతున్నారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా కొనసాగుతున్న నేపథ్యంలో చికెన్ గున్యా సోకడంతో ఆయా పనులకు వెళ్లలేక పోతున్నామని రైతులు, రైతు కూలీలు వాపోతున్నారు.

చికెన్‌గున్యాకు తోడు వైరల్‌జ్వరాలు విజృంభిస్తున్నాయి. వీటి బారిన పడినవారు వారం పది రోజులపాటు మంచానికే పరిమితం అవుతున్నారు. పల్లెల్లో సీజనల్ వ్యాధులు విజృంభించడంతో గ్రామీణ ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు.

పడకేసిన పారిశుధ్యం...

- ఆయా గ్రామాల్లో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది. వర్షపు నీరు నిలిచిపోతున్నందున దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఫలితంగా వివిధ సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఇంటింటా సర్వే జరిపి ఆయా వ్యాధుల బారినపడ్డ వారిని గుర్తించి వైద్యం అందించాలని పలువురు కోరుతున్నారు. అలాగే పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని వారంటున్నారు.



సంక్షిప్త సమాచారం

పొన్కల్ బ్యాంక్ ఎదుట
రైతుల ఆందోళన

- 31 లోగా సమస్యను పరిష్కరిస్తాం
- జోనల్ మేనేజర్ అభిషేక్


రైతులతో మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్

మామడ రూరల్, ఆగస్టు 17 : మండలంలోని పొన్కల్ గ్రామం లోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో తీసుకున్న రుణాలు మాఫీ కావడం లేదని రైతులు ఆందోళన చేశారు. శని వారం గ్రామానికి వచ్చిన బ్యాంక్ జోనల్ మేనేజర్ అభి షేక్, సిబ్బందిని రైతులు నిలదీశారు. అన్ని బ్యాంకుల్లో రుణమాఫీ జరుగుతుంటే కేవలం ఈ బ్యాంక్‌లో ఎందుకు జరగడం లేదన్నారు. మూడో విడతలో కేవలం 15 మంది రైతులకు, రెండు లక్షల లోపు రుణమాఫీ ఎలా జరుగు తుందని మిగతా వారికి ఎందుకు రుణమాఫీ రాలేదని రైతులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ మాట్లాడుతూ... ఈ బ్యాంక్ నుంచి 1500ల మంది వినియోగదారుల లిస్టును పంపించామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, సంబంధిత అధికారులు రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఈ సమస్యను ఈ నెలాఖరు వర కు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే బ్యాంకుల్లో లావాదేవీలు నిర్వహించమని 10 గ్రామాల రైతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, నాయకులు, యువకులు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఆర్టీసీ ద్వారా రాఖీలు పంపే ఏర్పాటు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 17 : పలు ప్రాంతాలకు రాఖీలు పంపేందుకు ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు వినియోగించుకోవాలని డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. తక్కువ ఖర్చుతో వేగంగా చేర్చనున్నట్లు తెలిపారు.

జిల్లా సగటు వర్షపాతం
17.1 మిల్లీమీటర్లు

నిర్మల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్రమం తప్పకుండా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రోజున జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జిల్లా సగటు వర్షపాతం 17.1 మిల్లీమీటర్లు కాగా జిల్లాలో అత్యధికంగా నిర్మల్‌లో 64.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే మామడ మండలంలో 36.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టు అయిన కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 7.603 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 7.157 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి 339 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. అలాగే స్వర్ణ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.484 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 1.440 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి 120 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. అలాగే గడ్డెన్న వాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.852 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 1.165 టీఎంసీలుగా ఉంది. అలాగే ప్రాజెక్టు ఎగువ ప్రాంతమైన మహారాష్ట్ర నుంచి 463 క్యూసెక్కుల వరద నీరు చేరుతుంది.